
క్లుప్తంగా

ఏఈవోగా వరప్రసాద్



మాడుగుల : వ్యవసాయ విస్తరణాధికారిగా కె.వరప్రసాద్ శనివారం సత్యవరంలో రైతు సేవా కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తామన్నారు. ప్రస్తుతం రబీకి సంబంధించి విత్తనాలు మండలంలోగల 23 రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది గౌరునాయుడు, రైతులు పాల్గొన్నారు.

నేడు లక్ష బిల్వ సహిత సహస్ర కుంకుమార్చన



కె.కోటపాడు : ఆర్లి గ్రామంలో గల భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం లక్ష బిల్వ సహిత సహస్ర కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ బోశెం కృష్ణారావు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. లక్ష మారేడుపత్రితో శివునికి పూజా కార్యక్రమం జరపనున్నట్టు గోరుగుంతుల వేంకటేశ్వరశర్మ పేర్కొన్నారు. ఉదయం నుంచి నిర్వహించే ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని లక్ష బిల్వ సహిత సహస్ర కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

పోలీస్ స్టేషన్ సందర్శించిన నర్సీపట్నం డీఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ మోహన్

గొలుగొండ : గొలుగొండ పోలీస్ స్టేషన్‌ను నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.మోహన్ శనివారం సందర్శించారు. రికార్డులు, పోలీస్‌స్టేషన్ భద్రత పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణలో పోలీస్ సిబ్బంది నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. ఏజెన్సీ నుంచి గంజాయి అక్రమ రవాణాపై నిఘా ఉంచాలన్నారు. గంజాయి పాత నేరస్తులను పరిశీలించాలని, గంజాయి పెండింగ్ కేసులు త్వరగా విచారణ చేసి తదుపరి రిపోర్టులు అందించాలన్నారు. అలాగే ఎంవీ కేసులు, ట్రిపుల్ డ్రైవింగ్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పి. రామారావుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

నర్సీపట్నం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న చేపట్టిన ర్యాలీని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు ఈరెల్లి చిరంజీవి, మధ్యాహ్న భోజనం సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.ప్రసన్న పిలుపునిచ్చారు. వేములపూడిలో కార్మికులతో సమావేశమై మాట్లాడారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు.

ఆధ్యాత్మిక పుస్తకాల పంపిణీ



వంటర్లపాలెంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆరిపాక కామేశ్వరావు

మాడుగుల రూరల్ : అన్ని మతాలు సారంశం ఒక్కటే అన్న నినాదంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక పరమైన పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. వద్దాదికి చెందిన అతిథి దేవోభవ స్వచ్ఛంద కార్యదర్శి ఆరిపాక కామేశ్వరావు ఆధ్వర్యంలో వంటర్లపాలెం, వీరవల్లి, పోతనపూడి, తదితర గ్రామాలల్లో హిందూ, ముస్లిమ్, క్రైస్తవ, మతాలకు చెందిన పుస్తకాలను ప్రజలకు పంపిణీ చేశారు. అన్ని మతాల సారంశం ఒక్కటేనని ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు.

టమాటా రైతులు కుదేలు

- విజృంభించిన వేరుకుళ్లు తెగులు
- నేలపాలైన లక్షల రూపాయలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు
- 300 ఎకరాలకు పైగా పంట నష్టం



లింగంపేటలో సాగవుతున్న టమాటా



వేరుకుళ్లు తెగులు సోకిన పంటను చూపుతున్న రైతు

గొలుగొండ : టమాటా రైతు కుదేలు అయ్యాడు. డివిజన్‌లో ఎక్కవ సాగు జరిగే గొలుగొండ మండలంలో ఈ సాగు చేసే రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. 300 ఎకరాలకు పైగా పంట వేరుకుళ్ల తెగులు సోకి పంట కాపు దశలో నేలమట్టం అయ్యింది. విత్తనాలలో నాణ్యత లేకపోవడమే ప్రధాన కారణంగా రైతులు, ఉద్యానవనశాఖ అధికారులు భావిస్తున్నారు. లక్షలు రూపాయలు నేలమట్టం కావడంతో రైతులు లబోదిబో అంటున్నారు.

300 ఎకరాలకు పైగానే సాగు

ప్రతి ఏటా ఈ సీజన్‌లో గొలుగొండ మండలం లింగంపేట, చోద్యం, గొలుగొండ, చిన్నయ్యపాలెం, కొత్తమల్లంపేట, అమ్మపేట, రామచంద్రపురం, గుజ్జుమానుపాకల, ఏఎల్‌పురం తదితర గ్రామాల్లో విస్తారంగా సాగు చేయడం జరుగుతుంది. అయితే ప్రతి ఏటా ఆగస్టు, అక్టోబర్‌లో నాట్లు వేయడం జరుగుతుంది. అయితే మొక్కలు ఏపుగా పెరిగి పిందె దశలో ఈ తెగుళ్ల విజృంభించడం రైతులకు శాపంగా మారింది. పంటంతా నాశనం అవుతుంటే ఏమి చేయాలో తెలియక రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరానికి 30 నుంచి 40 వేల వరకు ఖర్చు అయ్యిందని రైతులు అంటున్నారు.

వేరుకుళ్లు తెగులు అధికం

పై గ్రామాల్లో నాట్లు వేసిన రైతులు నారు పెంచిన ప్పటి నుంచి జాగ్రత్తలు పాటిస్తున్నారు. పంట నాట్లు వేసి నెల రోజులు అయినప్పటి నుంచి వేరుకుళ్ల తెగుళ్ల ప్రారంభం కావడం జరిగింది. పంట పెరిగే సమయంలో ఈ వ్యాధి రావడంతో మొక్క రెండు రోజుల్లో చనిపోతుంది. చాలా సంవత్సరాలు నుండి టమాటా సాగు చేసి అనుభవం ఉన్న రైతులు కూడా ఏమి చేయలేక చేతిలెత్తేసారు.

విత్తనం లోపం

టమాటా సాగు రైతులకు ప్రధాన సమస్య విత్తనం నాణ్యత కాకపోవడం వల్లనే ఇటువంటి తెగుళ్ల వస్తున్నట్టు రైతులు అంటున్నారు. మార్కెట్‌లో హైబ్రీడ్ విత్తనాలు పేరుతో మోసం జరుగుతున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదని అంటున్నారు. నర్సీపట్నం మార్కెట్‌లో టమాటా విత్తనాలు అధికంగా అమ్మకాలు చేస్తుంటారు. అధిక రేట్లు తీసుకొని విత్తనాలు నాణ్యత లేనివి తీసుకువచ్చి రైతులకు అమ్మకాలు చేయడం వల్లనే ఇటువంటి సమస్య వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కష్టం మట్టిపాలు



టమాటా సాగుపై మొదటి నుండి ఆసక్తి ఉంది. ఈ ఏడాది సకాలంలో విత్తనాలు తీసుకువచ్చి టమాటా సాగు ప్రారంభించాం. మొక్క ఏపుగా పెరిగే సమయంలో ఈ వేరుకుళ్ల తెగుళ్ల రావడం వల్ల చాలా నష్టపోయాం. వేలాది రూపాయలు పెట్టుబడులు మట్టిపాలు అయ్యాయి. విత్తనాలు నాణ్యత లేకపోవడమే ఇందుకు కారణం. ఉద్యానవనశాఖ అధికారులు పలుసార్లు వచ్చి సలహాలు ఇచ్చినా ప్రయోజనం కనిపించలేదు.

– నారాయణరావు, రైతు, గొలుగొండ

బాక్టీరియా వల్లనే ఈ సమస్య



టమాటా సాగులో బాక్టీరియా వల్లనే ఈ సమస్య అధికంగా కనిపిస్తుంది. మండలంలో పలు గ్రామాల్లో టమాటా సాగు చేస్తున్న రైతులకు పంటలో వేరుకుళ్లు తెగులు వల్ల పంట నాశనం అవుతుంది. వీటి నివారణకు ఆక్సీక్లోరైడ్ మందు 3 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. టమాటా పంటపై తెగుళ్ల నివారణకు రైతులకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుంది.

– శిరీష, ఉద్యానవనశాఖ అధికారిణి, గొలుగొండ

అందని ప్రాజెక్టు తాగునీరు

- పంపు ఆపరేటర్ల తొలగింపుతో సమస్య
- నిత్యం ప్రజలకు తప్పని ఇబ్బందులు



పైడిపాల కాలనీ వద్ద వృథాగా పోతున్న తాగునీరు

మాకవరపాలెం: తాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నా ప్రజలకు తాగునీరు అందడం లేదు. దీంతో నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లచ్చన్నపాలెం వద్ద ఉన్న సర్పానదిలో రూ.7 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును నిర్మించారు. దీని నుంచి లచ్చన్నపాలెం, బూరుగుపాలెం, పాపయ్యపాలెం, పెద్దిపాలెం, పైడిపాల, తూటిపాల, తాడపాల, బూరుగుపాలెంతో సహా 20 గ్రామాలకు నిత్యం తాగునీరు అందించాల్సిఉంది. మూడు నెలలుగా సక్రమంగా తాగునీరు అందడం లేదని మాకవరపాలెం, మామిడిపాలెం, పోతలూరు, తదితర గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా ఈ ప్రాజెక్టు నీటిని ప్రజలకు సరఫరా చేసేందుకు పోతలూరు, మాకవరపాలెం, మామిడిపాలెం, బూరుగుపాలెం గ్రామాల ప్రాంతాల్లో ఉండే పంపు ఆపరేటర్లను మూడు నెలల క్రితం కొత్తగా వచ్చిన ప్రాజెక్టు కాంట్రాక్టర్ తొలగించారు. దీంతో నిత్యం తాగునీటి సమస్య తలెత్తుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నెల రోజులుగా పైడిపాల కాలనీ వద్ద ఉన్న ట్యాంకు సమీపంలో తాగునీరు గెడ్డలోకి వృధాగా పోతోంది. ఈ నేపథ్యంలో మాకవరపాలెంలో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శనివారం కూడా ప్రాజెక్టు ద్వారా మండల కేంద్రంలో తాగునీరు అందకపోవడంతో ప్రజలు నీటికి తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిత్యం తాగునీటిని సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేజీబీవీ మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషి



కేజీబీవీలో మురుగునీటి సమస్యను పరిశీలిస్తున్న ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి: రైవాడ పంచాయతీ శివారు బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని దేవరాపల్లి ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు అన్నారు. బేతపూడి కేజీబీవీని సర్పంచ్ చల్లా లక్ష్మితో కలిసి శనివారం ఆయన సందర్శించారు. కేజీబీవీలోని మురుగునీరు పంట పొలాల్లోకి వెళ్లడంతో బాధిత రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేజీబీవీలో డ్రైనేజీని ఆయన పరిశీలించారు. సర్పంచ్‌తో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ భువన మాధురితో మురుగునీటి సమస్య పరిష్కార మార్గంపై చర్చించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట స్థానిక పంచాయతీ సెక్రటరీ జామి అప్పారావు, మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల్లో అతిగా యాంటీబయాటిక్స్‌తో దుష్ఫలితాలు



సదస్సులో మాట్లాడుతున్న ఏడీ చిట్టినాయుడు

మాడుగుల : ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా యాంటీ బయోటిక్స్ వినియోగంపై స్థానిక డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పశువైద్యశాఖ ఏడీ వి. చిట్టినాయుడు మాట్లాడారు. ప్రస్తుత కాలంలో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లలో, యాంటీబయోటిక్స్, ఇతర ఔషధాల వినియోగం పెరిగిపోవడం వల్ల, అత్యవసర పరిస్థితిలో అవి పని చేయకుండా పోతున్నాయని, సరైన వ్యాధికి సరైన మందు వాడకం ఉండాలన్నారు. అవసరం లేకుండా ఔషధాల వినియోగం వల్ల పశువుల్లో దుష్ఫలితాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, శాస్త్రి పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల స్పెషల్ డ్రైవ్



దేవరాపల్లిలో పారిశుధ్య పనులు చేపడుతున్న అధికారులు

రోలుగుంట : కె.నాయుడుపాలెం గ్రామంలో శనివారం పారిశుధ్య పనులపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరావు, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు గ్రామ పంచాయతీ, చెత్తతో సంపద తయారీశాల, పాఠశాల తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనుల్లో పాల్గొన్నారు. మురుగుకాల్వల్లో పూడికలు తీయించారు. సర్పంచ్ బాబులు, మాజీ సర్పంచ్ చంద్ర మౌళి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశాలు పాల్గొన్నారు.

చీడికాడ : చీడికాడలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, తుప్పలు, డొంకలు తొలగించారు. ఎంపీడీవో వి.హేమసుందరరావు ఆధ్వర్యంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పారిశుధ్య సిబ్బందితో కలిసి గ్రామంలో ప్లాస్టిక్ చెత్తను సేకరించారు. దుకాణాల వద్ద చెత్త బుట్ట ఉపయోగించాలని సూచించారు.

దేవరాపల్లి : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. మండల, గ్రామ స్థాయి అధికారులు గ్రామాల్లో చెత్తా చెదారాన్ని తొలగించి పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. దేవరాపల్లి, కాశీపురం జరిగిన కార్యక్రమంలో స్థానిక అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. దేవరాపల్లిలో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెం : పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. శనివారం చొడుగెడ్డ ప్రాంతంలో చెత్త తొలగింపు పనుల్లో ఎంపీడీవో పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను వారంలో ఒక రోజు శుభ్రం చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛభారత్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అపరాల విత్తనాలు పంపిణీ

మాడుగుల : సత్యవరం గ్రామంలో శనివారం అపరాలు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎతఈవో వర ప్రసాద్ మాట్లాడారు. సత్యవరం గ్రామానికి 500 కిలోల మినప విత్తనాలు, 100 కిలోల పెసర విత్తనాలు, 20 బస్తాలు వరి విత్తనాలు రాయితీలపై రైతు సేవా కేంద్రానికి రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జె.నాగమణి ఎంపీటీసీ తలారి అప్పారావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు సర్జరీ



ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను పరామర్శిస్తున్న హీరో ఆకాష్, కుటుంబ సభ్యులు

నర్సీపట్నం: మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో రోబోటిక్ హిప్ రిప్లేస్‌మెంట్ సర్జరీ శనివారం జరిగింది. సార్వత్రిక ఎన్నికల ముందు గడపగడపకు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన బైక్ ర్యాలీలో ప్రమాదవశాత్తు పడడంతో మాజీ ఎమ్మెల్యే కాలు విరిగింది. హైదరాబాద్‌లో చేయించిన సర్జరీ విజయవంతమైంది. కుటుంబ సభ్యులు సినీ హీరో ఆకాష్, దర్శకుడు పూరీజగన్నాథ్ కుటుంబ సభ్యులు గణేష్‌ను పరామర్శించారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఏకగ్రీవం



ఎన్నికైన యూటీఎఫ్ మండల కార్యవర్గ సభ్యులు



ఎం.కె.వల్లాపురం పాఠశాలలో నూతన కార్యవర్గం

రోలుగుంట : మండల యూటీఎఫ్ కార్యవర్గం ఏకగ్రీవం అయింది. అధ్యక్షుడిగా కాళింగ సతీష్, ప్రధాన కార్యదర్శిగా యు.నాగభూషణం, ఇతర కార్యవర్గం ఎన్నికైనట్టు పరిశీలకులు, జిల్లా సహాయ అధ్యక్షురాలు పి.గాయత్రి శనివారం ప్రకటించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల కమిటీ ఎన్నికను నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా కె.కేశవరావు, సహాధ్యక్షురాలిగా బోనిల భారతి, కోశాధికారిగా డి.అప్పారావు ఎన్నికయ్యారు.

మాడుగుల రూరల్ : మండల ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యు.టి.ఎఫ్) నూతన కార్యవర్గాన్ని ఎం.కె. వల్లాపురం ఎంపీపీ పాఠశాలలో శనివారం నూతనంగా ఎన్నుకున్నారు. జిల్లా యు.టి.ఎఫ్ కార్యదర్శి పాలిమేర చంద్రరావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల యు.టి.ఎఫ్ అధ్యక్షుడిగా జె.పి.ఎస్. కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఆడారి అప్పారావు, గౌరవ అధ్యక్షుడిగా శరగడం జగ్గారావు, సహాధ్యక్షుడిగా సత్యనారాయణ, మహిళా సహాధ్యక్షురాలిగా రాపేట లావణ్య, కోశాధికారిగా ఎం.కోటేశ్వరావు, ఆడిట్ కమిటీ సభ్యులుగా బి.రామ్‌కుమార్, సి.హెచ్. శివ, పి.శ్రీను, డి.కిశోర్, ఆర్, మురళితో పాటు జిల్లా కౌన్సిలర్‌గా సిహెచ్.ఆనందరావు, కె.సత్తిబాబు, ఎస్.కొండలరావు, పి.చంద్రరావు ఎన్నికయ్యారు.

తూటిపాలలో బిర్సాముండా జయంతి



విద్యార్థులకు గిరిజనుల జీవనశైలిని వివరిస్తున్న హనుమంతప్ప

మాకవరపాలెం : గిరిజన వీరుడు బిర్సాముండా 150వ జయంతిని మండలంలోని తూటిపాలలో నిర్వహించారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజనుల ఆచార వ్యవహారాలను తెలియజేసేందుకు ఆహ్వానించిన భద్రాచలం సమీపంలోని దుమ్ముగూడెంకు చెందిన గిరిజనుడు హనుమంతప్ప దొర విద్యార్థులకు గిరిజనుల జీవనశైలిని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గతంలో చదువుకునేందుకు ఇబ్బందులు పడాల్సివచ్చిందని, ఇటీవల కాలంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాము, ఇతర పాధ్యాయులు పాల్గొన్నారు.

కపిల ఆవుల గోశాలలో సందడిగా వన సమారాధన



వన సమారాధనలో భోజనాలు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నాతవరం: కార్తీకమాసంలో కపిల ఆవుల గోశాల ప్రాంగణంలో కార్తీక సమారాధన కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందాయకంగా ఉందని తహాశీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నారు. మండల కేంద్రం శివారు తాండవ కాలువ వద్ద ఆవుగడ్డ శివకు చెందిన కపిల ఆవులు గోశాలలో శనివారం కార్తీక వనసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ కనుమరుగవుతున్న కపిల ఆవులను ఈ ప్రాంతంలో పెంచడం చూస్తే చాలా ఆనందంగా ఉందన్నారు. గోశాల నిర్వహకులు ఆవుగడ్డ శివను అభినందించారు. ఇంఛార్జి ఎంపీడీవో పార్ధసారథి, ఎంఈవో వరహాలబాబు, వెలుగు ఏపీఎం కనకరాజు, ఉపాధి హామీ ఏపీవో చిన్నారావు, తాండవ మాజీ చైర్మన్ కొండబాబు, మాజీ ఎంపీటీసీ మాణిక్యం, మాజీ ఎంపీపీ లక్ష్మి పాల్గొన్నారు. తాండవ రిజర్వాయరు సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు కార్తీక మాసం శనివారం కావడంతో మహిళలు సరదగా గడిపారు. ప్రాజెక్టు దిగువనున్న శ్రీనల్లగొండమ్మ తల్లిని దర్శించుకుని పార్కులో ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు.

మాడుగుల రూరల్ : వీరవల్లి అగ్రహారం సుంకర వారి కళ్లాలు వద్ద శనివారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన సుంకర వారి కుటుంబీకులు ఏటా కార్తీక మాసంలో ఈ సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేస్తుంటారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి వేడుకలు



నర్సీపట్నంలో సత్యసాయిబాబాకు పూజలు



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : మున్సిపాలిటీ భగవాన్ శ్రీసత్యసాయి బాబా మందిరంలో సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకుని సత్యసాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి నగర సంకీర్తన, అన్న సమారాధన కార్యక్రమాలు జరిపారు.

మాడుగుల : మోదమాంబ కాలనీలో వెలసిన సత్యసాయి మందిరంలో శనివారం భగవాన్ సత్యసాయి జన్మదిన వేడుకలు నిర్వహించారు. తెల్లవారు నగర సంకీర్తన పల్లకీ సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు శ్రీనివాసరావు, బలరామ్, రాజుకొండ పాల్గొన్నారు.

కె.కోటపాడు : బాబా 99 వ జయంతి వేడుకలు శనివారం వి.సంతపాలెంలో ఘనంగా జరిగాయి. సత్యసాయి సామూహిక వ్రతాలతో పాటు 99 మంది వృద్ధులకు దుప్పట్లు అందించారు. సాయంత్రం సత్యసాయి పల్లకీసేవ జరిపారు. మాజీ సర్పంచ్ సింహాద్రప్పడు, సర్పంచ్ దేవీలత, దేముడునాయుడు,రామానాయుడు పాల్గొన్నారు. కూండ్రపువానిపాలెంలోను సత్యసాయి జన్మదిన వేడుకలను జరిపారు.

గొలుగొండ : సత్యసాయిబాబా పుట్టినరోజు సందర్భంగా ఏఎల్‌పురం గ్రామంలో శనివారం 60 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అన్నసమారాధన జరిపారు. మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, ఆలయ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు



కె.జె.పురంలో గౌరీ పరమేశ్వర్లును దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు



చౌడువాడలో సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



దొండపూడిలో సారె ఊరేగింపు

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో గౌరీ పరమేశ్వర్లు ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారికి సారె ఊరేగింపు నిర్వహించారు. పుర వీధుల్లో సారెను ఊరేగించారు. అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పార్వతీ పరమేశ్వర్లును మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు దర్శించుకున్నారు. సర్పంచ్ జామి రమణబాబు, ఉప సర్పంచ్ గోవింద రాజులు, పాల్గొన్నారు. రాత్రి నిమజ్జనోత్సవం జరిపారు.


కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో సతకం పట్టు వద్ద గల గౌరమ్మకు గ్రామస్థులు శనివారం సారెను సమర్పించారు. గ్రామానికి చెందిన మహిళలు అరిసెలు, లడ్డూలు, కాజా తదితర స్వీట్లతో పాటు వివిధ రకాలైన పండ్లుతో కూడిన సారెను తలపై ధరించి గ్రామంలో ఊరేగింపు జరిపి గౌరమ్మ వద్ద ఉంచారు. రాత్రికి అనుపు కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

చోడవరం: రావికమతం మండలం దొండపూడిలో వేంచేసియున్న శ్రీ గౌరీపరమేశ్వరులకు సారె ఊరేగింపు శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అనంతరం అనుపు మహోత్సవం ఘనంగా జరిపారు.

పాఠశాల ఆవరణలో ప్రైవేటు సభలకు అనుమతి లేదు

మాడుగుల రూరల్ : పాఠశాల ఆవరణలో ప్రైవేటు సభలు, సమావేశాలు, వివాహలు, ఇతర శుభ కార్యాలు నిర్వహణకు అనుమతి లేదని స్థానిక ఎంఈఓలు బి.దేముడమ్మ, పాండురంగారావు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మతపరమైన సభలు, సమావేశాలు, రాజకీయ సమావేశాలను, విద్యశాఖకు సంబంధం లేని ఇతర కార్యక్రమాలు పాఠశాల ఆవరణలో నిర్వహించవద్దని దీనికి సంబంధించి జి.వో. ప్రభుత్వం జారీ చేసిందని పేర్కొన్నారు.

రోగులకు సకాలంలో వైద్యసేవలు అందాలి



సమావేశంలో ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు : పీహెచ్‌సీ పరిధిలో ప్రజలకు వైద్య సిబ్బంది ద్వారా మెరుగైన వైద్యం సకాలంలో అందేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. లంకవానిపాలెం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఎంపీపీ ఆసుపత్రి అభివృద్ధిపై ప్రధాన వైద్యాధికారి శైలజ, కమిటీ సభ్యులతో చర్చించారు. హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, లంకవానిపాలెం సర్పంచ్ దొరబాబు, ఎంపీటీసీ గోపి, అచ్చిబాబు పాల్గొన్నారు.

కాంగ్రెసు నియోజకవర్గ ఇన్‌చార్జిగా పడాల



మాడుగుల రూరల్: మాడుగుల నియోజకవర్గ కాంగ్రెసు పార్టీ ఇన్‌చార్జిగా సీనియర్ కాంగ్రెసు నాయకులు పడాల కొండలరావును నియమించారు. అచ్యుతాపురంలో డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న చేతుల మీదుగా నియామకపు ఉత్వర్వులు అందుకున్నారు.